
# కూలీ కర్మ...!

- ఎ. సువర్ణ



'నువ్వు చెప్పేదంతా బాగానే వుందిరా నాయినా. నేనక్కడికి రావడానికి బదులు ఇక్కడే వుండడమే నాకు బాగుంటుందిరా. బతికినంత కాలం బతకబోను. ఇంకపైన నాకేం కావాలి. ఏదో కడుపుకింత తిండి, కట్టుకునేందుకు ఏడు గజాల పంచ. అంతగా నాకేదైనా అయితే ఓ ఫోను చేస్తే రెక్కలు కట్టుకు వాలుతావు' అన్నది వర్ధనమ్మ సర్వసాధారణంగా.

'అవునమ్మా, నువ్వు చెప్పేదంతా బాగానే వుంది. కానీ...'

విశ్వాన్ని అతను పనిచేసే ఓ పెద్ద ఇంటర్నేషనల్ కంపెనీ ఛైర్మన్- డైరెక్టర్ల మీటింగ్‌లో అతన్ని ఓ డైరెక్టరుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కానీ ప్రమోషన్ మీద ఢిల్లీ వెళ్లాలి. అక్కడ ఆల్‌రెడీ విశ్వం ఫ్యామిలీ వుండేందుకని ఓ పాష్ లొకాలిటీలో ఫోర్ బెడ్‌రూమ్ ఫ్లాట్ సిద్ధంగా వుంది.

విశ్వం భార్య విశాలి కంప్యూటర్ ప్రొఫెషనల్.

'గోల్డెన్ కీ విచ్ కెన్ ఓపెన్ ఎనీ డోర్' అన్నట్లు ఆమెకు ఏ ఊళ్లోనైనా ఉద్యోగం అతి తేలికగా దొరుకుతుంది. ఏ సాఫ్ట్‌వేర్ కంపెనీ అయినా ఆమెను కళ్ల కద్దుకు ఉద్యోగం ఇస్తారు. ఇప్పుడు వాళ్లకు విశాలి ఉద్యోగ సమస్య కాదు. పిల్లల చదువులు సమస్యలు కావు.

విశ్వం, విశాలి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు. కొడుకులిద్దరి చదువులు పూర్తయి ఒకరు మస్కట్‌లోనూ, ఒకరు సింగపూర్‌లోనూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కూతురుకు పెళ్లి అయి భర్త ఏడాది బాబుతో ఆస్ట్రేలియాలో వుంటోంది. పిల్లల సమస్యలు లేని వాళ్లకిప్పుడు పెద్ద సమస్య వర్ధనమ్మ- విశ్వం తల్లి.

ఆమెను తమతో ఢిల్లీ తీసుకెళ్లేందుకు మొదటి సమస్య- ఆమె అన్నట్లుగానే ఢిల్లీ అతి చలి, అతి వేడి వాతావరణానికి ఆమె తట్టుకోలేదు. విశ్వం, విశాలి పొద్దున ఆఫీసులకు వెడితే రాత్రికి కానీ రారు. భాష రాని ఢిల్లీకి వస్తే రోజంతా నాలుగు గోడల మధ్య ఇంట్లోనే ముడుచుకు కూర్చోవాలి. ఓ మాటామంతీ వుండదు.

అంతకంటే భాష తెలిసిన హైదరాబాదులోనే తల్లి వుంటే బాగుంటుందనుకున్నాడు విశ్వం. కానీ ఇక్కడున్నా సమస్యే. ఇంత పెద్ద ఇంట్లో ముసలిదైపోయిన తల్లి ఒక్కత్తే వుండడం ఉచితం కాదు. బీపీ పేషెంటు అయిన తల్లికి అత్యవసరంగా ఏమైనా అనారోగ్యం చేస్తే డాక్టరు దగ్గరకు తీసికెళ్లే దిక్కుండదు. మందులు కొనిచ్చే వారుండరు. ఇలా విశ్వం ఎన్నో రకాలుగా ఆలోచించిన మీదట తల్లి తనతో ఢిల్లీ రానని మొండికెత్తడం వల్ల, అతనికెంత మాత్రం ఇష్టం లేకపోయినా తల్లిని 'వానప్రస్థాశ్రమ' ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించాలన్న నిర్ణయానికొచ్చాడు.

ఓల్డేజ్ హోమ్ హెడ్‌ని కలుసుకున్నాడు. ఓల్డేజ్ పరిసరాలు, వసతులు, అస్తమాన దశకు చేరుకున్న తల్లులను కన్నకూతుళ్లలా ప్రేమగా చూసుకునే స్టాఫ్, పసిపిల్లల్లా ప్రవర్తించే అక్కడున్న తల్లులందరినీ చూశాక, అక్కడి సౌకర్యాలు విశ్వం విశాలిను ప్రశాంతంగా ఫ్లైయిట్ ఎక్కేట్లు చేశాయి.

వర్ధనమ్మను ఓల్డేజ్ హోమ్‌లో చేర్చుకునే ముందు పూర్తిచెయ్యమని ఇచ్చిన అప్లికేషన్ ఫారమ్‌లో మొదట పూర్తిచేయవలసిన కాలమ్‌లోని ప్రశ్న విశ్వాన్ని అయోమయంలో పడేసింది.

ఇక్కడ చేర్చుకోబడిన వాళ్లు ఒకవేళ హఠాత్తుగా మరణిస్తే మొదట తెలియపరచవలసిన వారి పేరు, విలాసం, వారికున్న సంబంధం, ఫోన్ నెంబరు, ఇ-మెయిల్ అడ్రస్ రాయాలి. ఆ విలాసంలోని వారు రావడానికి వీలు అవని పక్షంలో మరణించిన శవ సంస్కారం మేమే చేస్తాం. అందుకు లిఖితపూర్వక అంగీకారం ఇవ్వాలి.

'ఇదేమిటి మేడం...?' అని బాధగా అడిగాడు విశ్వం.

'ఇది నిజం విశ్వంగారూ... అది మీకు తెలియనిదీ కాదు. పునరపి జననం, పునరపి మరణం- అన్నది నిజం. చావనేది ఎవరికి ఎప్పుడు ఎలా వస్తుందో ఎవరూ చెప్పలేరు.'

'మా హోమ్‌లో మీవంటి వారు వో అత్యవసర పరిస్థితులలో వారి తల్లులను వదిలేసి వెళ్లిపోతారు. ఏవో కారణాల వల్ల తప్పు అడ్రస్‌లిచ్చే కొడుకులు, కోడళ్లు ఎంతోమంది. ఇంతమంది ముసలివారి మధ్య ఎవరికైనా మరణం సంభవించవచ్చు. తతిమా వారికి మరణించిన శరీరం భయాన్ని కలిగిస్తుంది. అందుకని బాడీని ఎంత తొందరగా దహనం చేస్తే అంత మంచిది' అని నిర్వాహకురాలు సుభద్ర అన్నాక, విశ్వం తప్పనిసరిగా తన పూర్తి పేరు, తనకున్న సంబంధం, ఇంటి, ఆఫీసు ఫోన్ నెంబర్లు, ఇ-మెయిల్ అడ్రస్... అన్ని వివరాలూ ఇచ్చి, తల్లి చనిపోతే తను రాకపోయినా హోమ్ వారు దహన సంస్కారాలు చేయడానికి అనుమతి ఇస్తున్నట్లుగా రాసి సంతకం చేశాడు.

విశాలి విశ్వాలు ఢిల్లీ వచ్చి ఆరు మాసాలు గడిచిపోయాయి. ఓ వారం జర్మనీ, మరో వారం జపాన్, ఆ తరువాత వారం ఫ్రాన్స్ అని విశ్వం మహా బిజీ. ఎంత బిజీగా వున్నా, ఏ దేశంలో వున్నప్పటికీ ప్రతీ వారం తల్లికి ఫోన్ చేసి తల్లితో మాట్లాడ్డం మాత్రం మరువడు.

విశాలిని ఓ పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ కన్సల్టెంట్‌గా అపాయింట్ చేసుకుంది. ఆమెలోని సాఫ్ట్‌వేర్ నాలెడ్జ్ ప్రకాశించేందుకు మంచి అవకాశం ఇచ్చిందా కంపెనీ. విశాలికు తెలివితేటలు, ఓపిక, శరీరంలో శక్తిసామర్థ్యాలు వున్నంత వరకు... వయసు... అదేం పెద్ద సమస్య

కాదు. ప్రతీ సంవత్సరం ఒక్కో సంవత్సరంగా వయసు కూడుకుంటూ పోతుంది. వయసు శరీరానికే కానీ మనసుకు కాదనేదే విశాలి అభిప్రాయం.

విశ్వం డైరెక్టరుగా వున్న కంపెనీ దేశ విదేశాలలో అనేక శాఖలుగా విస్తరించింది. హైదరాబాదులో మరో శాఖకు శంకుస్థాపన చేసి విస్తరింపజేయడానికి ముఖ్యమంత్రి నుంచి అనుమతి లభించి విశ్వం హైదరాబాదు వెళ్లవలసి రావడం దంపతులిద్దరికీ మహదానందాన్ని కలిగించడానికి కారణం- ఇద్దరూ వాళ్ల వాళ్ల తల్లులను చూసుకోవచ్చనే.

ముఖ్యంగా విశాలికి మరీ తృప్తిగా వుంది. అందుకు- ఆమె తల్లి వెంకటలక్ష్మి పరిస్థితి ఏమీ బాగుండలేదని చెల్లెలు ఫోన్ చేయడమే కారణం. అలాంటి తల్లిని చూడాలనుకోవడం ఏ కూతురుకైనా సహజమే!

విశాలి తండ్రి చనిపోయి పాతిక సంవత్సరాలైంది. విశాలికి ఇద్దరు చెల్లెళ్లున్నారు. చిన్న చెల్లెలు భర్త, పిల్లలతో విజయవాడలో వుంది. పెద్ద చెల్లెలు వరంగల్‌లో వుంది. ఆమె భర్త ఆజంజాహీ మిల్లులో స్పిన్నింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగంలో వున్నాడు. మిల్లు క్వార్టర్స్‌లో వుంటారు. తల్లి ఆమె దగ్గరే వుంటుంది.

'ఏమే రేవతీ, అమ్మకెలా వుందే...?' అని చెల్లెల్ని ఫోనులో అడిగింది విశాలి.

'ఎలా వుందని చెప్పనక్కయ్యా... మరో రెండు రోజులు గడవడం కష్టమని డాక్టరు చెప్పారు. పల్స్ చాలా వీక్‌గా వుంది. దొరకడం లేదు. ఉద్ధరిణెడు నీళ్లు కూడా గొంతులోకి పోవడం లేదు...' అని చెల్లెలు ఫోనులో చెప్పడం వల్ల ఢిల్లీ నుంచి సరాసరి వరంగల్ వచ్చారు విశ్వం, విశాలి. వారు రేవతి ఇంటిముందు కారు దిగేసరికి చీకటి తెరను పక్కకు తోసి వెలుగు రేఖలు ప్రవేశించాయి.

చుట్టుపక్కలిళ్ల వారందరూ వాకిళ్లలో కళ్లాపులు చల్లి ముగ్గులు పెడుతున్నారు.

'ఎవరూ... విశాలా! అమ్మను సాగనంపడానికొచ్చావా తల్లీ? మంచిపని చేశావు. తల్లిని ఆఖరిసారిగా చూసుకుంటావు...' అన్నది ఎదురింట్లో వున్న రెడ్డమ్మ. విశాలి మాట్లాడేంతలోనే వాకిట్లో కారు ఆగిన చప్పుడు వినిపించిన రేవతి తలుపు తీసుకుని బయటికొచ్చింది.

'రా... అక్కయ్యా!' అని అంటూండగానే ఆమెలో దుఃఖం కట్టలు తెంచుకుంది. చెల్లెలిని పొదివి పట్టుకుని లోపలికొచ్చింది విశాలి.

'ట్యూబ్‌లైట్ స్విచ్ వెయ్యి' అన్నది అక్క. చెల్లెలు స్విచ్ వేసింది. గదంతా ప్రకాశవంతం అయింది.

మంచంలో అచేతనంగా పడుకుని వున్న తల్లి పక్కన కూర్చుని, 'అమ్మా... అమ్మా... నీ పెద్ద కూతురు విశాలినొచ్చాను. కళ్లు తెరిచి చూడమ్మా...' అన్న కూతురు పిలుపు తల్లికి వినిపించినట్లు లేదు. కళ్లు తెరిచి చూడలేదు తల్లి కూతుర్ని.

'రాత్రంతా అత్తయ్య నిద్ర పోనేలేదు...' అన్నాడు రేవతి భర్త సూర్యం.

'అక్కా... కాఫీ!' అని రేవతి అక్కా బావలకు పెద్ద పెద్ద మగ్గులతో కాఫీ ఇచ్చింది.

ఓ సిప్ చేసిన విశాలి ఏదో అనుకున్నట్లుగా తల్లి తలను ఒడిలోకి తీసుకుని, 'అమ్మా... అమ్మా... ఏదీ కొంచెం నోరు తెరు... నీ కూతురు కాఫీ ఇస్తోంది. ఓ గుక్కెడు తాగు...' అన్న విశాలి చిన్న ఉద్ధరిణె పట్టేంతగా తల్లి నోరు తెరిచి ఉద్ధరిణెడు కాఫీ తల్లి గొంతులో పోసింది. కాఫీ గుటకేసిన వెంకటలక్ష్మి కనురెప్పలు మెల్లిగా తెరుచుకుని కూతుర్ని చూసింది. మళ్లీ మూసుకోలేదా కళ్లు... శాశ్వతంగా తెరుచుకుండిపోయేందుకే తెరుచుకున్నట్లున్నాయి ఆ కళ్లు.

మెరుపులా చూసిన ఆ చూపులో ఏదో చెప్పాలన్నట్లున్నాయి...

'ఇంకో ఉద్ధరిణెడు కాఫీ తాగమ్మా...'

ఇంకెక్కడ తాగుతుంది కాఫీ... ఆమెలోని హంస ఎగిరిపోతేను... తల నుంచి పాదాల వరకూ చల్లబడిపోయి తల్లి కట్టెగా అయిపోయిందని తెలుసుకుంది విశాలి.

కబురు తెలిసి తెలిసిన వాళ్లందరూ వచ్చి పరమాత్మలో కలిసిపోయిన వెంకటలక్ష్మిని దర్శించుకుని నమస్కరించి, అక్కాచెల్లెళ్లను ఓదార్చారు. రేవతి, నిర్మలలు నోట్లో గుడ్డ కుక్కుకుని ఏడ్చారు. ఎంత పెద్దవాళ్లయినా తల్లి తల్లే... తల్లి ఇకపై లేదనుకున్న వాళ్లకు దుఃఖం ఆగలేదు. ఎంతైనా విశాలి ఇంటికి పెద్ద కూతురు

కదా...!

తరువాత కార్యక్రమం చూడవలసిన బాధ్యత ఆమెదే కదా...!

'ఓసారి ఇలా వస్తారా...?' అని విశాలి భర్తను పక్కకు పిలుచుకెళ్లింది.

'మా అమ్మానాన్నలకు ముగ్గురమూ ఆడపిల్లలమే... తలకొరివి పెట్టే కొడుకు లేడు. నేను మీకు ఆథరైజ్ చేస్తున్నట్లుగా నా చేతి నుంచి దర్భలను మీ చేతికిస్తాను. మీరు మా అమ్మకి దహన సంస్కారాలు చేసి కర్మకాండ చెయ్యొచ్చు. నాకు మా అమ్మ మీద అంతులేని ప్రేమ. ఇంటికి పెద్ద కూతుర్ని. అందుకని అమ్మకి తలకొరివి నా చేతుల మీదుగా పెట్టాలనుంది. చేస్తారా...?'

'ఇందుకు నన్నింతగా బతిమలాడాలా విశాలీ... నేను- మా అమ్మ వేరు, మీ అమ్మ వేరు అనుకోవడం లేదు. అసలు అమ్మ స్థానం మహత్తరమయినది.'

'మీరు చెప్పేది బాగానే వుంది. మీ అమ్మ బతికుండగా, మా అమ్మ దహన సంస్కారాలు చేయడానికి మీ మనసుకేం కష్టం కలగదు కదా...!'

'ఒప్పుకోదని, కష్టపడతానని నువ్వే అనుకుంటే ఎలా...? మీరు చిన్నవాళ్లుగా వుండగానే మీ నాన్నగారు పోతే మీ ముగ్గురినీ పెంచి పెద్దచేసి, ఇంతింత చదువులు చెప్పించి, గొప్ప గొప్ప సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేసిన మీ మదర్ నిజంగా రిమార్కబుల్ లేడీ. అంతే కాకుండా నీ చేతిలోంచి మంత్రించిన దర్భలు నా చేతిలోకి తీసుకున్నాక విశాలి తల్లి వెంకటలక్ష్మి అని మంత్రంలో అంటారే కానీ, మా అమ్మ పేరు చెప్పరుగా...!' అన్న భర్తను కృతజ్ఞతాభావంతో చూసింది విశాలి. కన్నీళ్లతో భర్త చేతులు పట్టుకుంది.

'సారీ మేడమ్! ఇవాళ ఢిల్లీ బంద్...' విశ్వం ఆఫీసు ప్యూన్ 'ఆజ్ ఆఫీస్ బంద్ హై...' అన్న సమాధానాలే వచ్చాయి ఫోనులో.

'విశ్వం గారి ఇంటి ఫోన్ నెంబరుకు ఫోన్ చేస్తే ఎవరూ ఎత్తడం లేదే... ఇప్పుడేం చెయ్యాలి... ఇప్పుడేం చేద్దాం...?' అని అడిగింది వానప్రస్థాశ్రమ నిర్వాహి సెక్రటరీ, నిర్వాహి సుభద్ర గారిని.

'ఫ్యాక్స్ పంపించు... ఇ-మెయిల్ పంపించు...' అని విశ్వాన్ని కాంటాక్ట్ చెయ్యవలసిన విధానాలన్నీ కాంటాక్ట్ చేసినా ఏమీ ఫలితం కనిపించలేదు.

'ఇంతమంది ముసలివాళ్ల మధ్య వర్ధనమ్మ బాడీని ఎంతసేపని వుంచుకోగలం...? విశ్వంగారు ఎలాగూ తల్లి చనిపోతే దహన సంస్కారాలు చెయ్యడానికి మనకి అనుమతి పత్రం రాసిచ్చారుగా. అమీర్‌పేట్ క్రిమిటోరియానికి ఫోన్ చెయ్యండి...' అన్నది నిర్వాహకురాలు సుభద్ర.

'తల్లులు... ఎందరో తల్లులు... అమ్మలుగన్న అమ్మలు... తండ్రులు... ఎందరో తండ్రులు... ఎంతోమంది కూతుళ్లు... కూతుళ్లకు కూతుళ్లు... కొడుకులు... ఎంతోమంది కొడుకులు... కొడుకులకు కొడుకులు... వీళ్లలో వాళ్లు చనిపోతే వచ్చి దహన సంస్కారాలు చేయించుకునే అదృష్టం ఎంతమందికో...' అని సుభద్ర గారు వేదాంతోపన్యాసం ఇచ్చి వర్ధనమ్మ దహన సంస్కారాలు చేశారు.

'నిన్నటి వరకూ మనిషి రూపంలో వున్నామె నేడు పిడికెడు బూడిదైపోయింది. అందరూ రండి... భేదభావాలు లేకుండా అంతా బ్రహ్మమయమే...'

ఆశ్రమంలో ఎవరూ రాని అనాథ ప్రేత దహనం చేసే జయంతిని పిలిపించి వర్ధనమ్మకు ప్రేత సంస్కారం చేయించి ఆమెకు కూలీ ఇచ్చింది కూలి కర్మ చేసినందుకు.

'మా అమ్మకు మీరు దహన సంస్కారాలు చేయడం మాకందరికీ ఎంతో తృప్తినిచ్చింది...' అన్నది విశాలి కళ్లు తుడుచుకుంటూ.

హైదరాబాదు వచ్చి తల్లి కోసం హోమ్‌కు వెళ్లి విషయం తెలుసుకున్న విశ్వం- నేను బతికుండి ఇంత దగ్గరలో వుండి తల్లికి కూలి కర్మ చేయించవలసిన తన దౌర్భాగ్యాన్ని తల్చుకుని కన్నీరుమున్నీరుగా విలపించాడు. ☆

## పురస్కారం

మనుష్యుల్ని పునీతులుగా చేసి
గోదావరి నల్లబడింది!
పరిస్థితి చూసిన కృష్ణమ్మ
ఆలోచనతో దిగాలుపడింది!

— సాయిప్రకాష్